ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు రూ..కిలోల్లో.. టమాటా 35, నల్ల వంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 45, క్యాప్సికం 45, పచ్చకాకర 26, పందిరి బీర 26, క్యాబేజీ 11, క్యారెట్ 41, దొండ 23, గుండు బీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 28, కీర 18, దోసకాయ 13, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 23, చామగడ్డ 23, మొరంగడ్డ 28, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. నోట్: ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

అభివృద్ధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్: మేడిబావిలోని శాఖ గ్రౌండ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెద్దవారికి, చిన్న పిల్లలకు ఉపయోగపడేలా పార్క్ మాదిరి పనులు చేపట్టామని తెలిపారు. సుమారు రూ. 40 లక్షల వ్యయంతో కంపౌండ్ వాల్, మెష్, గేట్, వాకింగ్ ట్రాక్, వృద్ధులు కూర్చోడానికి బెంచీలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి పనుల్లో తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. వీలైనంత తొందరగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు


కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు

రసూల్‌పురా: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి పార్టీలోకి చేరుతున్నారని కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేశ్ అన్నారు. పికెట్ క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ రెండో వార్డు మైనార్టీ విభాగం అధ్యక్షుడు గౌస్, పలువురు గణేశ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం రేవంత్‌రెడ్డి మైనార్టీల సంక్షేమం కోసం చేస్తున్న పనితీరు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు నచ్చి కాంగ్రెస్ పార్టీలోకి పలువురు చేరుతున్నారని అన్నారు. పార్టీలోకి చేరుతున్న వారందరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సనత్‌నగర్: నాగరాజరాజేశ్వరీనగర్‌లో కొలువుదీరిన నాగరాజరాజేశ్వరీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వారోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, రాజు, నరసింహ, రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి



ఉస్మానియా యూనివర్సిటీ: సెప్టెంబరు 19న జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్వీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట మహాధర్నా విజయవంతం కోసం రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం బీఆర్ఎస్వీ నాయకులు తుంగ బాలు, కొంపెల్లి నరేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం 2 ఏళ్లు గడుస్తున్నా.. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయలేదన్నారు. 19న ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట జరిగే మహాధర్నాలో విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో రమేశ్, మల్లేశ్, సురేశ్, పృథ్వీ, అరవింద్, అచ్యుత్‌కిరణ్, వంశీ పాల్గొన్నారు.

బన్సీలాల్‌పేట్‌లో ముగిసిన బోనాల జాతర

బన్సీలాల్‌పేట్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే అమ్మవారి బోనాల వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి. ఇందులో భాగంగా సోమవారం బన్సీలాల్‌పేట్ పరిసర ప్రాంతాల్లో అమ్మవారి రంగం, గావు, జల్లికడవ ఊరేగింపు కార్యక్రమాలు కనుల పండువగా నిర్వహించారు. బన్సీలాల్‌పేట్, బోయిగూడ, గొల్లకొమురయ్య కాలనీ, ఐడీహెచ్ కాలనీ, చాచానెహ్రునగర్, గాంధీనగర్, న్యూబోయిగూడ, బండమైసమ్మ నగర్, సున్నంబట్టి తదితర ప్రాంతాల్లోని అమ్మవారి దేవాలయాల ఎదుట వందలాది మంది నృత్యాలు చేస్తూ బోనాల వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. న్యూబోయిగూడ, బన్సీలాల్‌పేట్ తదితర ఆలయాల్లో అమ్మవారి రంగం కార్యక్రమాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. బోనాలు తృప్తిగా చేశారని, వర్షాలు పడి ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని రంగం రంగం కార్యక్రమంలో భవిష్యత్ వాణిని వినిపించారు. అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపులో పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఐడీహెచ్ కాలనీ, బీజేఆర్ నగర్, చాచానెహ్రునగర్ తదితర ప్రాంతాల్లో జరిగిన బోనాల వేడుకల్లో అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపులో కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేశ్, బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షులు భరత్ గౌడ్, మర్రి పురురవరెడ్డి, అంగముత్తు శ్రీనివాస్, వై. సురేశ్‌కుమార్, ఎస్.వై గిరి, ఎమ్మార్పీఎస్ ప్రభాకర్ బీఆర్ఎస్ నాయకులు తీగుళ్ల రామేశ్వర్ గౌడ్, బొద్దు మహేశ్, ఎస్. రాజేందర్, ప్రత్యేక పూజలు చేశారు. బోనాల వేడుకల్లో భాగంగా నిర్వహించిన అమ్మవారి ఫలహారం బండ్ల ఊరేగింపు అర్ధరాత్రి వరకు వర్షంలో కూడా నృత్యాలు చేస్తూ ఆనందంతో జరుపుకొన్నారు. తీన్మార్ దప్పుచప్పుళ్ల పోతరాజుల వీరనృత్యాలు, యువత డ్యాన్స్‌లతో బోనాల సంబరాలు అంబరాన్ని తాకాయి. బోనాల వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్, ఎస్.ఐ మౌనిక బందోబస్తును నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో బోనాల వేడుకలు ముగిశాయి.


బీజేఆర్ నగర్‌లో అమ్మవారి ఫలహారం బండి ఎదుట ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గణేశ్


అమ్మవారిని దర్శించుకుంటున్న కార్పొరేటర్

క్షేత్రస్థాయిలో నాలాల పరిశీలన

లాలాపేట: వర్షాకాలంలో నగరంలో సంభవించే వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలనే సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో సోమవారం అధికారుల బృందం తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని నాలాలను పరిశీలించారు. ప్రధానంగా లాలాపేట వినోభానగర్, ఇందిరానగర్, సత్యానగర్, చంద్రబాబునగర్, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో ఉన్న ఓపెన్ నాలాను పరిస్థితిపై అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాలాలపై ఏలాంటి అక్రమణలు వెలిశాయి. వరద నీటి ప్రవాహం తదితర అంశాలపై ఆరా తీశారు. భారీ వర్షాలకు పొంచి ఉన్న వరద ముప్పుకు గల కారణాలపై క్షుణ్ణంగా తెలుసుకున్నారు. వరద ముప్పు నివారణకు తీసుకోవాల్సిన ప్రత్యామ్నాయాలపై అధికారులు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ వేణు, ఇరిగేషన్ అధికారులు, ఎస్ఎన్‌డీపీ అధికారులు ఉన్నారు.


లాలాపేట ఇందిరానగర్‌లో ఓపెన్ నాలాను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

నులి పురుగులతో పిల్లల్లో రక్తహీనత


విద్యార్థులకు నులి పురుగుల మాత్రలను వేస్తున్న వైద్య సిబ్బంది


విద్యార్థులకు ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లు వేస్తున్న బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి

పద్మారావునగర్: నులి పురుగులు పిల్లల ఆరోగ్యానికి హాని చేస్తాయని పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని సోమవారం బోయిగూడ పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బోయిగూడ సెయింట్ ఫిలోమినా పాఠశాలలో ఎత్తున విద్యార్థులకు వైద్య సిబ్బంది నులి పురుగుల నిర్మూలన మాత్రలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. నులి పురుగులు పిల్లల ఆరోగ్యానికి హాని చేస్తాయన్నారు. పిల్లల్లో రక్తహీనత, పోషకాహారలోపం, కడుపునొప్పి, విరోచనాలు వంటి సమస్యలకు దారితీస్తాయన్నారు. నులి పురుగుల నివారణ మాత్రలు వేయడం ద్వారా పిల్లల్లో నులి పురుగుల వ్యాప్తిని అరికట్టడానికి వీలవుతుందన్నారు. బోయిగూడ పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లోని సుమారు 5 వేల మందికి ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సుగల విద్యార్థులకు నులి పురుగుల నిర్మూలన మాత్రలను వేస్తున్నామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలకు నులి పురుగుల మాత్రలను వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తుమ్మ భాస్కర్‌రెడ్డి, డాక్టర్లు గీతిక, విద్యా, స్వప్నిక, పూజ, వైద్య సిబ్బంది ఉమా, జ్ఞానమ్మ, గీత పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ వేద్దాం: కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి

సనత్‌నగర్: నులి పురుగుల నివారణకు 1–19 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులందరూ ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లు వేసుకోవాలని బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి అన్నారు. బేగంపేట మహర్షి విద్యాలయ విద్యార్థులకు ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లు వేసే కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. రక్తహీనతకు కారణమయ్యే నులి పురుగుల నివారణకు ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఈ ట్యాబ్లెట్లను వేసుకోవాలన్నారు. పౌష్టికాహారంతోనే ఆరోగ్య సమస్యలు దూరమవుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

నూతన సీఐగా పదవీ బాధ్యతల స్వీకరణ


నగర సీపీ ఆనంద్‌ను కలసిన సీఐ అనురాధ

రసూల్‌పురా: కార్ఖానా పీఎస్ నూతన సీఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన అనురాధ మర్యాదపూర్వకంగా నగర పోలీస్ కమిషనర్ సీవీ.ఆనంద్‌ను కలిసి పూలమొక్కను అందజేశారు. సోమవారం కార్ఖానాలో మీడియాతో మాట్లాడుతూ.. పీఎస్ పరిధిలో శాంతి భద్రలకు పెద్దపీట వేస్తామన్నారు. నూతన చట్టాలపై, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పీఎస్ పరిధిలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తూ వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. 2004 బ్యాచ్‌కు చెందిన అనురాధ ఎస్‌బీ నుంచి ఇటీవల కార్ఖానా పీఎస్‌కు బదిలీ అయ్యారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన రామకృష్ణ ఎస్‌బీకి బదిలీపై వెళ్లారు.

పోలీసు అధికారులకు వీడ్కోలు


పోలీసులను సన్మానిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

రాంగోపాల్‌పేట్: గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్తున్న పోలీసు అధికారులను ఉత్తర మండలం ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలికారు. సోమవారం గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐ ప్రమీల, హోంగార్డు శిరిగిరి శ్రీకాంత్‌లను పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాల నివారణ, పబ్లిక్ సేఫ్టీ అంశాలతో విశేషమైన సేవలు అందించారని కొనియాడారు.

సీఎం అమీర్‌పేటలో పర్యటించడం సంతోషదాయకం

అమీర్‌పేట: భారీ వర్షాల నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి వరద ప్రభావిత ప్రాంతమైన అమీర్‌పేటలో పర్యటించి వరద సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ఆదేశించడం సంతోషదాయకమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. పార్టీ నాయకులు సోమవారం బౌద్ధనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ముందు ఉంటుదన్నారు. సీఎం రాకతో దశాబ్దాల నుంచి బౌద్ధనగర్, గుంగుబాయి బస్తీ, రిలయన్స్ లైన్‌లో నివసించే ప్రజలకు వరద నీటి ప్రభావ సమస్య తీరుతుందని తెలిపారు. బల్దియా, హైడ్రాధికారులు సమన్వయంతో పనిచేసి వెంటనే సమస్యకు పరిష్కారం కోసం ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించడం అభినందనీయమని చెప్పారు. దీనిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్‌యాదవ్, రవీందర్, సత్యనారాయణ యాదవ్, కటకం భాస్కర్ పాల్గొన్నారు.


బౌద్ధనగర్‌లో పర్యటించిన కాంగ్రెస్ నాయకులు

కులవృత్తులను కాపాడాలి

లిబర్టీ: సాంప్రదాయ కులవృత్తులను కాపాడేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఆదినారాయణ విన్నవించారు. కూలిపోతున్న కులవృత్తులను కాపాడేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక కార్యచరణ రూపొందించాలన్నారు. సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కులవృత్తులు కూలిపోతున్నాయని సాంప్రదాయ చేనేతలకు అండగా నిలవాలని కేంద్ర ప్రభుత్వానికి తెలుగు ప్రభుత్వాలకి విన్నవించారు.

గోరెటి రమేశ్‌ను విడుదల చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: గాయకుడు గోరెటి రమేశ్ అరెస్ట్‌ను తెలంగాణ ప్రజావేదిక నాయకుడు రెంజర్ల రమేశ్ సోమవారం తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశ్నించే కళాకారులను, జర్నలిస్టులను అరెస్టులు చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో భావప్రకటన స్వేచ్ఛకు తావు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రమేశ్ భార్య నిండు గర్భిణి అని, ఆయనపై అక్రమంగా పెట్టిన కేసులను రద్దు చేసి విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఓయూలో అమరులకు నివాళి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మాల అమరులకు విద్యార్థులు, అధ్యాపకులు నివాళులర్పించారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట మాల స్టూడెంట్స్ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ మాదాసు రాహుల్‌రావు మాట్లాడుతూ.. దివంగత మాల మహానాడు నేత పీవీ రావు ఆధ్వర్యంలో జరిగిన సచివాలయం ముట్టడిలో పోలీసు కాల్పుల్లో అమరులైన నలుగురి మాలల మరణానికి నరహంత చంద్రబాబు నాయుడు కారణమని మండిపడ్డారు. పీవీ రావు స్ఫూర్తితో మాల అమరుల ఆశయం కోసం వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడనున్నట్లు రాహుల్ రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా.వెంకటేశ్వర్లు, డా.ఉదయ్, డా.వీరాస్వామి, అంసా ఓయూ అధ్యక్షులు నామా సైదులు, దిలీప్, రమేశ్, కిరణ్, భానుతేజ, రాహుల్, మధు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఓయూలో మాల అమరులకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

విద్యార్థులకు ఉత్సాహంగా పోటీలు



సనత్‌నగర్: మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. తల్లిదండ్రుల (వయో వృద్ధుల) పోషణ–పిల్లల కర్తవ్యం అనే అంశంపై వ్యాసరచన పోటీలతో పాటు జనరల్ నాలెడ్జ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ పాఠశాలలకు చెందిన దాదాపు 100 మంది విద్యార్థులు హాజరై ప్రతిభ చాటారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ ఆసరా కమిటీ ఉపాధ్యక్షుడు, మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఎస్‌టీ శాయి పర్యవేక్షణలో ఆయా పోటీలు జరిగాయి.

మహనీయులకు ఘన నివాళి

అడ్డగుట్ట: హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం అడ్డగుట్ట డివిజన్ బీజేపీ అధ్యక్షురాలు గాజుల సౌందర్య ఆధ్వర్యంలో భారత దేశ స్వాతంత్ర్య పోరాట యోధుడు సుభాష్ చంద్ర బోస్ విగ్రహాన్ని శుభ్రం చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను యువతకు తెలియ చేయాలనే ఉద్దేశంతో బీజేపీ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు ఆదేశానుసారం సోమవారం తుకారాంగేట్‌లోని సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని శుభ్రం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కన్నాభిరామ్, గంభీరావుపేట సాయన్న, హరి శివప్రసాద్, ఉదయ్ యాదవ్, కృష్ణ, శివలింగం, వీరేశం, కళావతి, రాజు, వసంత, శివాజీ, హంస రాజు, శ్రీనివాస్, స్వామి పాల్గొన్నారు.


తుకారాంగేట్‌లో సుభాష్ చంద్రబోస్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

తవ్వి.. వదిలేశారు



బౌద్ధనగర్: డివిజన్‌లోని నేతాజీ స్కూల్ రోడ్డు మార్గంలో పైప్‌లైన్ పనుల నిమిత్తం తవ్విన రోడ్డును సంబంధిత సిబ్బంది సరిగ్గా పూడ్చకుండా అలాగే వదిలేసి వెళ్లిపోయారు. దీంతో స్థానికులతో పాటు నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. పైగా కురుస్తున్న వర్షాలకు ఆ మట్టి కుప్పలు పూర్తిగా బురదమయంగా మారుతున్నాయని వాపోతున్నారు. అధికారులు వెంటనే మట్టిని పూడ్చి నూతన రోడ్డు వేయాలని బస్తీవాసులు కోరుతున్నారు.

నియామకం

పంజగుట్ట: జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్ఆర్‌సి) రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ద్యాగటి హరీష్, బత్తుల రాజశేఖర్‌ను నియమించారు. సోమవారం పంజగుట్టలోని కార్యాలయంలో జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ అధ్యక్షులు మొగుళ్ల భద్రయ్య వారికి నియామకపత్రాలు అందించారు. రాష్ట్రంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంలో హరిష్, రాజశేఖర్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

రోడ్డుపై మట్టికుప్పలు తొలగించరా ?

బౌద్ధనగర్: బౌద్ధనగర్‌లోని రేషన్‌షాపు వీధిలో రోడ్డుకు అడ్డంగా ఉన్న మట్టికుప్పలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. స్థానికంగా బస్తీలో రోడ్డు వేసిన సమయంలో వెలువడిన మట్టి వ్యర్థాలను పక్కనే వదిలేసిన వెళ్లారు. సంబంధిత అధికారులు వెంటనే వాటిని తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు అవుతున్నాయని, వెంటనే మట్టి కుప్పను తొలగించాలని ప్రయాణికులు, పాదచారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


బౌద్ధనగర్ రేషన్‌షాపు వీధిలో రోడ్డుపై మట్టికుప్ప

'జనవాసాల్లో హై వోల్టేజ్ లైన్‌ను అనుమతించొద్దు

లాలాపేట: రెసిడెన్షియల్ ఏరియాలో హై ఓల్టేజ్ పవర్ లైన్‌ను అనుమతించకుండా అధికారులకు ఆదేశాలివ్వాలని కోరుతూ లాలాపేటకు చెందిన యంగ్ మెన్ యూత్ అసోసియేషన్ నాయకులు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం అసోసియేషన్ నాయకుడు ప్రవీణ్ మాట్లాడుతూ ఇటీవల నూతనంగా నిర్మాణం చేసిన బహుళ అంతస్తులు(రెండు అపార్టుమెంట్స్)కు అవసరమైన విద్యుత్ సరఫరా కోసం కాంట్రాక్టర్లు విద్యుత్ అధికారులతో కుమ్మక్కై జనవాసాల మీదుగా నిబంధనలకు విరుద్ధంగా హై ఓల్టేజ్ పవర్ లైన్ తీసుకెళ్తున్నారు. స్తంభాలను సైతం ఏర్పాటు చేశారన్నారు. ఇళ్లపై నుంచి హై ఓల్టేజ్ లైన్ వేయడం వలన భవిష్యత్‌లో తమ ఇళ్లను పై అంతస్తులో నిర్మాణం చేసుకునే అవకాశం లేకుండా పోతుందన్నారు. దీంతో పాటుగా ఆ లైన్ ద్వారా స్థానికులకు రేడియేషన్ వంటి అనేక అనర్థాలు, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ విషయమై జీహెచ్ఎంసీ అధికారులకు, విద్యుత్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. దీనిపై తమకు న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించినట్లు ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యంగ్ మెన్ యూత్ అసోసియేషన్ నాయకులు ఉన్నారు.


ఇళ్లపై నుంచి నూతనంగా వేస్తున్న హై ఓల్టేజ్ లైన్

ఒరిగిన కరెంట్ స్తంభం.. పొంచి ఉన్న ప్రమాదం

లాలాపేట: తార్నాక సండే మార్కెట్ రోడ్డులో నాగార్జుననగర్ కమ్యూనిటీ హాల్ పక్కన ఉన్న కరెంట్ స్తంభం ఒక వైపుకు ఒంగిపోయి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై పడింది. దీంతో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతున్నాయి. ఈదురు గాలికి, వర్షానికి వైర్లు ఒకదానికి ఒకటి తాకి మంటలు చెలరేగుతున్నాయి. ఒరిగి ఉన్న కరెంట్ స్తంభంతో ప్రమాదం పొంచి ఉందని, తార్నాక వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కావునా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మూడు నెలలుగా పట్టించుకోవడం లేదు..

ఈ సందర్భంగా స్థానికుడు, బీజేపీ జిల్లా కార్యదర్శి మల్లికంటి వీరన్న మాట్లాడుతూ.. దాదాపు మూడు నెలల నుంచి ఈ విధంగా కరెంట్ స్తంభం ఒకవైపు ఒరిగిందని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. వైర్లు కిందకు ఉండటంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనలు చెందుతున్నారని అన్నారు. కావునా ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

